అసలే శిథిలం.. పైన మరో నిర్మాణం

- మున్సిపల్ భవనంపై అదనపు షెడ్ నిర్మాణం
- గతంలో ఆ భవనానికి మూడు సార్లు శ్లాబ్ మరమ్మతులు

పాలకొల్లు సెంట్రల్: గోరు చుట్టుపై రోకలి పోటులా ఆ మున్సిపల్ భవనం పరిస్థితి తయారైంది. అసలే శిథిలావస్థలో ఉన్న భవనంపై అధికారులు మరో భారీ షెడ్ నిర్మాణానికి ఉపక్రమించడంతో ఉద్యోగులు భయపడుతున్నారు. మునిసిపల్ కార్యాలయంలో ఉన్న పాత బంగ్లా 1926లో మరమ్మతులు చేసినట్లు అక్కడ ఓ శిలాఫలకం ఉంది. అంటే ఆ బంగ్లాను అప్పటికి ఎన్నాళ్ల క్రితం నిర్మించారో అధికారులు కూడా చెప్పలేకపోతున్నారు. 1920లో మునిసిపాలిటీగా ఏర్పడిన తరువాత ఆరు సంవత్సరాలకు మరమ్మతులు చేపట్టినట్లు ఆ శిలాఫలకం ద్వారా తెలుస్తుంది. ఈ బంగ్లాకు వెనుక భాగంలో ఉన్న ఇంజనీరింగ్ భవనం నిర్మించి సుమారు 43 సంవత్సరాలు కావస్తుంది. ఈ భవనం నిర్మాణం కొరకు 1962లో ఫౌండేషన్ వేసి 1982లో కౌన్సిల్ హాల్‌గా ప్రారంభించారు. ఈ భవనం పదేళ్ల క్రితమే లీకేజీలతో ఉండడంతో త్వరలో పూర్తిగా శిథిలావస్థకు చేరుకునే పరిస్థితి ఏర్పడుతుందని అధికారులు భయభ్రాంతులకు గురయ్యేవారు. పదేళ్ల క్రితానికే శ్లాబ్ లీకేజీలు అవుతుందని అప్పటికే మూడు పర్యాయాలు శ్లాబ్‌ను మరమ్మతులు చేసినట్లు మునిసిపల్ ఉద్యోగులు తెలిపారు. 2017లో ఈ భవనం శిథిలావస్థలో ఉందని తెలిసినా నాటి మునిసిపల్ పాలకమండలి సభ్యులు సుమారు రూ. 10 లక్షలు పోసి చైర్మన్ చాంబర్, అలాగే ఇంజనీరింగ్ సెక్షన్ డీఈ కార్యాలయంలో టైల్స్‌కు, బాత్‌రూమ్‌కు రూ.2 లక్షలు ఖర్చు చేశారు. నాడు పది లక్షలు ఖర్చు చేసినా చైర్మన్ చాంబర్‌కు మూన్నాళ్ల ముచ్చటగా లీకేజీల బెడద తప్పలేదు. శ్లాబ్‌కన్నా సైడ్ గోడ లీకేజీతో పొక్కిపోయాయి.



పాలకొల్లు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఇంజనీరింగ్ భవనం దుస్థితి (ఫైల్)



భవనంపై నిర్మాణ పనులను చేస్తున్న దృశ్యం



శ్లాబ్ కొడుతుండగా రంధ్రాలు పడిన దృశ్యం

రూ. 20 లక్షలతో భారీగా షెడ్ నిర్మాణం

అయితే ప్రస్తుతం ఇదే భవనంపై మళ్లీ భారీ నిర్మాణం చేపట్టారు. అయితే ఈ భవనం శ్లాబ్‌పై పిల్లర్స్ వేయడానికి శ్లాబ్ కొడుతుండగా శ్లాబ్ చిల్లులు పడిందంటే పరిస్థితిని మనం అర్థం చేసుకోవచ్చు. అయినా అధికారులు మాత్రం భారీగా షెడ్ నిర్మాణానికి అడుగులు ముందుకు వేస్తున్నారు. ఈ భవనంపై ఇంత బరువు నిర్మాణం చేస్తే ఆగుతుందా? అంటూ కార్యాలయ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా కార్యాలయం లోపల లీకేజీలతో గోడలు పొక్కుపోతున్నాయి. అయినా లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఇంటీరియర్ పనులు చేయిస్తున్నారు. ఇంజనీరింగ్ కార్యాలయానికి ఇన్నాళ్లకు మోక్షం కలుగుతుందని ఆనందించాలో? లేదా ప్రమాదంలో విధులు నిర్వహించాల్సి వస్తుందని భయపడాలో అర్థంకాని పరిస్థితుల్లో సిబ్బంది ఉన్నారు. సెక్షన్‌లో ఈ భవనం పడగొట్టి నూతన నిర్మాణం చేయాల్సి ఉంటుందని గత మునిసిపల్ అధికారులు చర్చించుకునే వారు. ఈ అదనపు నిర్మాణంపై కార్యాలయ సిబ్బంది మాత్రం ఆందోళనతోనే ఉన్నారు.

ఇబ్బంది ఉండదు

ఇంజనీరింగ్ భవనంపై అదనపు షెడ్ నిర్మాణం వల్ల భవనానికి ఇబ్బందేమి లేదు, భవనంపై ఉండే చెత్తను శుభ్రం చేయకపోవడం, మెయింటెనెన్స్ లేకపోవడంవల్ల లీకేజీలు ఏర్పడే పరిస్థితి వచ్చింది, శుభ్రం చేసుకుంటే ఆ సమస్య అనేది ఉండదు. రూ.20 లక్షలతో పైన షెడ్, కార్యాలయం లోపల ఇంటీరియర్ వర్క్స్ చేయిస్తున్నాము. పాత పిల్లర్స్‌తో కలిపి నూతన పిల్లర్లు వేయడానికి శ్లాబ్‌కు హోల్స్ పెట్టారు తప్ప ఈ భవనానికి ఎటువంటి ప్రమాదం ఉండదు.

– రాజ్‌కుమార్, మునిసిపల్ డిఈ, పాలకొల్లు

పాలకొల్లు యువకుడి భీమ్ ఏ షార్ట్ ఫిలిమ్‌కు అవార్డు



పామర్తి పవన్

పాలకొల్లు సెంట్రల్: పట్టణానికి చెందిన పామర్తి పవన్‌కు ఉత్తమ దర్శకుడు జాతీయ అవార్డు వచ్చింది. ఇటీవల పవన్ తీసిన భీమ్ ఏ షార్ట్ ఫిలిమ్‌కు టీఐఎంఎంఏ (ది ఇండియన్ మూవీ మేకర్స్ అవార్డ్ 2025 బెంగుళూరు) సంస్థ దర్శకత్వ విభాగంలో ఉత్తమ దర్శకుడిగా జాతీయ అవార్డును అందజేసినట్లు అతని మిత్రులు తెలిపారు. మొదటిసారి తీసిన షార్ట్ ఫిలింకే ఉత్తమ దర్శకుడు అవార్డు రావడం అభినందనీయమని మిత్రులు, సన్నిహితులు పవన్‌కు అభినందనలు తెలియజేశారు.

వలంధర్‌రేవులో ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

నరసాపురం: నరసాపురంలో నాయకర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. రాత్రి నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పండుగలు ఇలా సంప్రదాయ రీతిలో చేసుకోవాలన్నారు. నాయకర్ ట్రస్ట్ సేవలను ప్రశంసించారు.

క్లుప్తంగా

జూద క్రీడలను అడ్డుకోవాలని వినతి



డీఎస్పీ శ్రీవేదకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

నరసాపురం: సంక్రాంతి పురస్కరించుకుని కోడి పందేలు, పేకాట, గుండాట వంటి జూదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు కోరారు. శనివారం నరసాపురం డీఎస్పీ డాక్టర్ డి.శ్రీవేదను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ పోలీసు హెచ్చరికలను పట్టించుకోకుండా పెద్ద ఎత్తున బరులు సిద్ధం చేస్తున్నారని అన్నారు. విచ్చల విడిగా మద్యం అమ్మకాలు కూడా సాగించడానికి ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాగైతే యువత చెడు వ్యసనాల వైపు వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బూడిద జోగేశ్వరరావు, కోడి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు అందే మృతి



అందే నాగబసవన్న

పెనుగొండ: వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు అందే నాగబసవన్న(65) గుండె పోటుతో మృతి చెందారు. ఆయన స్వగ్రామం ఆచంట వేమవరంలో శుక్రవారం అర్ధరాత్రి గుండె పోటు రావడంతో చికిత్స అందే లోపులోనూ కన్ను మూశారు. ఆయన కర్ణబత్తులు, చేనేత కార్పొరేషన్ డైరక్టరుగా 2024 వరకూ కొనసాగారు. ఇటీవలే చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడుగా నియమితులయ్యారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నాగబసవన్న మృతిపై మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ సుంకర ఇందిర, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు జక్కంశెట్టి చంటి, సర్పంచ్‌లు కోట సరోజినీ వెంకటేశ్వరరావు, జక్కంశెట్టి శ్రీరాములు, ఆచంట వేమవరం ఉప సర్పంచ్ కొండేటి సురేష్, పెచ్చెట్టి సత్యనారాయణ తదితరులు సంతాపం తెలిపారు.

సచివాలయ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

ఆకివీడు: సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రామ, వార్డు ఏఎస్ఎంల సమస్యలు పరిష్కరించాలని ఆరోగ్య శాఖమంత్రి సత్య కుమార్ యాదవ్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎం.వెంకటలక్ష్మి మాట్లాడుతూ హెల్త్ సెక్రటరీలకు గ్రేడ్ 3 ఏఎన్ఎం నుంచి ఎంపీహెచ్ఏ ఫిమేల్ పదోన్నతి కోసం అక్టోబర్ 7న వినతి పత్రం అందజేశామన్నారు. సీనియార్టీ మెరిట్ లిస్టు ఇతర జిల్లాల నుంచి రాకపోవడంతో పదోన్నతి కల్పించలేదని చెప్పారని, అన్ని జిల్లాల నుంచి జాబితాను త్వరితగతిన వచ్చే విధంగా చర్యలు తీసుకుని, పదోన్నతి కల్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘ సభ్యులు వి.దుర్గ, పీ.బేబీ దైవాజీ, వీ.అరుణ, వెంటలక్ష్మి, సౌజన్య, జయమణి, నాగమణి ఉన్నారు.

మావుళ్లమ్మ ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ వారి వార్షిక ఉత్సవాల ఏర్పాట్లు భీమవరం డీఎస్పీ జయసూర్య శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల ఏర్పాట్లల్లో ఎలాంటి లోపాలు లేకుండా పక్కాగా ఉండాలని నిర్వహికులకు సూచించారు. క్యూ లైన్లల్లోని భక్తులు ఇబ్బందులు లేకుండా వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్సవాలల్లో అమ్మవారిని దర్శించుకొవడానికి జనం పెద్ద సంఖ్యలో తరలివస్తారు కాబట్టి దేవస్థానం వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులకుసూచించారు. ఆయన వెంట ఆలయ ఈఓ బుద్ధ మహలక్ష్మీ నగేష్, సీఐ నాగరాజు ఉన్నారు.

శానిటరీ వర్కర్స్ కనీస వేతనాలు చెల్లించాలి

పెనుగొండ: ఐదేళ్లుగా ప్రాథమిక,ఉన్నత పాఠశాలలో ఆయాలుగా పనిచేస్తున్న శానటరీ వర్కర్స్‌లో కనీస వేతనాలు రూ.26 వేలు, నెలనెలా వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం పెనుగొండ పంచాయతీ పార్కు వద్ద జరిగిన శానిటరీ వర్కర్స్ సమావేశంలో తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలు చేయాలని, రోజుకు నాలుగు సార్లు టాయిలెట్స్ శుభ్రం చేస్తున్నా ప్రభుత్వ విధానాలతో ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. ఉన్నత పాఠశాలల్లో 300 విద్యార్థులకు ఇద్దరు ఆయాలు పని చేయాలన్న నిబంధన ఉండడంతో, ఒక్క విద్యార్థి తక్కువై 299 మంది విద్యార్థులు ఉన్న దేవ, వడలి పాఠశాలల్లో ఒక్కో ఆయాను తొలగించి, ఒక్కరి పైనే పనిభారమంతా వేస్తున్నారన్నారు. సమస్యలు, పని వివరాలుపై ప్రభుత్వం సమీక్ష చేసి వారికి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కమిటీ సభ్యులు షేక్ పాదుషా, సీఐటీయూ నాయకులు మాదాసు నాగేశ్వర రావు, ఊటాల కుమారి, వెన్నపు సుధారాణి, వమ్ము అరుణ, టి.దుర్గ, బీఎం తాయారు పాల్గొన్నారు.



పెనుగొండ పంచాయతీ పార్కు వద్ద నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

రాజగోపాలస్వామి ఆలయంలో కుడారై

మొగల్తూరు: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత రాజగోపాలస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 27వ పాశురాన్ని పఠించి 108 కళశాలతో కుడారై గంగాళోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు సుదర్శనం లక్ష్మీ నరసింహాచార్యులు, రమేష్, రామకుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాదాన్ని అందించారు.

వేములదీవిలో..

నరసాపురం రూరల్: పవిత్ర ధనుర్మాసం సందర్భంగా శనివారం మండలంలోని వేములదీవి వేంకటేశ్వరస్వామి, పసలదీవి రామాలయం, పట్టణంలోని ఎంబర్‌మన్నార్ ఆలయాలలో కుడారై ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో ఆయా ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో స్వామివారి ముందు వెన్న, చెక్కర పొంగలి, పులిహోరలతో కుడారై ఏర్పాటు చేసి స్వామివారికి నైవేద్యంగా పెట్టారు. అనంతరం పాశురం చదివి ఉపన్యాసం చేశారు. వేములదీవిలో జరిగిన కార్యక్రమంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.



రాజగోపాలస్వామి ఆలయంలో 108 కలశాలతో గంగాళోత్సవం

ఊరికో బరి-హెచ్చరికలతో సరి



పెనుమంట్ర మండలంలోని ఓ గ్రామంలో కోడి పందేల నిర్వహణ కోసం ఏర్పాటు చేస్తున్న టెంట్లు



పెనుమంట్ర మండలంలోని ఓ గ్రామంలో కోడి పందేల నిర్వహణ కోసం స్థలాన్ని చదును చేస్తున్న దృశ్యం



పెనుమంట్ర మండలంలోని ఓ గ్రామంలోని పందేల శిబిరం వద్ద హడావుడి



మొగల్తూరు మండలంలోని ఓ గ్రామంలో సిద్ధమవుతున్న కోడిపందాల బరి

సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో సంతోషంగా నిర్వహించుకోవాలి. కోడి పందేలు వంటి జూద క్రీడలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామంటూ గత మూడు రోజుల నుంచి రెవెన్యూ అధికారులు, పోలీసులు చేస్తున్న ప్రచారం అంతా ప్రకటనలకే పరిమితమైంది. పాలకొల్లు, నరసాపురం, ఆచంట నియోజకవర్గాల్లో ప్రతి గ్రామంలో ఓ బరి ఏర్పాటు చేస్తున్నారంటే పరిస్థితిని మనం అర్థం చేసుకోవచ్చు. అయితే కోడి పందేల బరుల వద్దే గుండాటతో ఇతర జూద క్రీడలు నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. అలాగే పందేల బరుల వద్ద మద్యం అమ్మడానికి ఆయా ప్రాంతాల మద్యం షాపుల యజమానులు ఇప్పటికే నిర్వాహకులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. శనివారం సాయంత్రం పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన బరులు ఇవే. - పెనుమంట్ర/మొగల్తూరు

వైభవంగా ధనుర్మాస పూజలు



విశేషలంకరణలో జుత్తిగ సోమేశ్వర స్వామి



విశేష పూజలు అందుకుంటున్న జుత్తిగ లక్ష్మీజనార్దన స్వామి

పెనుమంట్ర: ధనుర్మాసం పురష్కరించుకుని జుత్తిగ గ్రామంలో శ్రీఉమావాసుకి రవి సోమేశ్వర స్వామితో పాటు ఆలయ ఆవరణలో ఉన్న శ్రీలక్ష్మీ జనార్దన స్వామికి ప్రతీ రోజు ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం లక్ష్మీజనార్దన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా శనివారం శని త్రయోదశిని పురష్కరించుకుని శ్రీఉమా సోమేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

మినీ గోకులం షెడ్డుల ప్రారంభం



పాలమూరులో మినీ గోకులం షెడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పితాని

పెనుమంట్ర: పల్లెపండుగలో భాగంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన మినీ గోకులం షెడ్డును ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ప్రారంభించారు. పాలమూరు గ్రామంలో కోరుకొండ నరసింహమూర్తి అనే రైతు రూ. 2.30 లక్షలతో ఈ షెడ్డు నిర్మించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బీవీఎస్ శర్మ, తహసీల్దార్ రవికుమార్ పాల్గొన్నారు.

పెనుగొండలో..

పాడి రైతులను ప్రోత్సహించేందుకు గోకులం షెడ్‌లను మంజూరు చేయడం జరిగిందని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం పెనుగొండలో గోకులం షెడ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పోడూరు గోవర్ధన, సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి, వేండ్ర రాము, కటికరెడ్డి నానాజీ పాల్గొన్నారు.